www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 29 జులై 2024
5
తిరుపతి

తిరుమల కాలినడకన పాము కలకలం

పాము కాటుకు గురైన భక్తుడు

ప్రజాశక్తి- తిరుమల: తిరుమల నడక మార్గంలో వెళ్తున్న ఓ భక్తుడిని పాము కాటేసిన ఘటన కలకలం సష్టించింది. శ్రీవారి దర్శనానికి నడక మార్గంలో వెళ్తున్న ఓ భక్తుడిని శనివారం పాము కాటేసింది. చీరాలకు చెందిన కొంతమంది భక్తులు అలిపిరి మెట్ల మార్గం గుండా తిరుమలకు వెళ్తున్నారు. ఈ క్రమంలో ఏడో మైలు వద్దకు రాగానే సమీపంలోని అటవీ ప్రాంతం నుంచి మెట్లపైకి చేరుకున్న పాము, మెట్లపై విశ్రాంతి తీసుకుంటున్న నాగేంద్ర అనే భక్తుడిని కాటేసింది. దీంతో శ్రీవారి భక్తులంతా ఒక్కసారిగా భయంతో హాహాకారాలు చేశారు. భక్తుల సమాచారం మేరకు అక్కడకు చేరుకున్న టీటీడీ, అటవీ సిబ్బంది పాము కాటుకు గురైన యువకుడిని తిరుమలలోని అశ్విని ఆస్పత్రికి తరలించారు. అక్కడే యువకుడు చికిత్స పొందుతున్నారు. యువకుడిని కాటేసిన పాము విషపూరితమైనది కాకపోవడంతో ప్రమాదం తప్పింది. ప్రస్తుతం అతని ప్రాణాలకు ఎలాంటి అపాయం లేదని వైద్యులు తెలిపారు.

ఉత్కంఠ భరితంగా చెవిరెడ్డి మోహిత్ రెడ్డి అరెస్టు

అర్ధరాత్రి బెంగుళూరు వెళ్లి తీసుకుని వచ్చిన పోలీసులు

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: తిరుపతి రూరల్ మాజీ ఎంపీపీ, వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి అరెస్టు, విడుదల ఉత్కంఠ భరితంగా సాగింది. బెంగుళూరు కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద హడావుడి చేసిన పోలీసులు, మోహిత్ రెడ్డి దుబాయ్‌కి వెళుత్తుండగా అదుపులోకి తీసుకొని తిరుపతికి తరలించారు. ఆదివారం ఉదయం 6.30 గంటలకు పోలీసులు తిరుపతి ఎస్వీయూ పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. హైకోర్టులో ముందస్తు బెయిల్‌పై విచారణ జరుగుతుండగా పోలీసులు అరెస్టు చేయడంపై విమర్శలు వెల్లువెత్తాయి. మోహిత్ రెడ్డికి మద్దతుగా పెద్దఎత్తున పార్టీ నేతలు, కార్యకర్తలు స్టేషన్ వద్దకు తరలివచ్చారు. స్టేషన్ వద్ద పరిస్థితిలో ఉద్రేకంగా మారాయి. తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాల నుంచి తరలి వస్తున్న పార్టీ క్యాడర్‌ను ఎక్కడికక్కడ పోలీసులు అడ్డుకున్నారు. తన కుమారుడు మోహిత్ రెడ్డి అక్రమ అరెస్టుపై మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకొని, స్టేషన్ నిదుట మౌనంగా నిరసన చేపట్టారు. పార్టీ నాయకులు కార్యకర్తలు ఆయనకు మద్దతుగా నిలిచారు. ఏటికెలకు పోలీసులు నాటకీయ పరిణామాల మధ్య 41 (ఏ) నోటీసు ఇచ్చి మోహిత్ రెడ్డిని విడుదల చేశారు. దీనిపై వైసీపీ నాయకులు పోలీసులను నిలదీశారు. కేసు నమోదు చేసినప్పటి నుంచి పోలీసుల కళ్ల ముందు ప్రజా క్షేత్రంలో తిరుగుతున్న మోహిత్ రెడ్డికి లుక్ అవుట్ నోటీసు ఎలా ఇచ్చారు. ఏదైనా ఒక కేసులో వున్న నిందితుడు పోలీసుల కంట పడకుండా తప్పించుకుని తిరగడం, దేశ ద్రోహం కేసు నిందితులకు ఇచ్చే లుక్ అవుట్ నోటీసు ఎలా ఇస్తారంటూ పోలీసులను విమర్శించారు. లుక్ అవుట్ నోటీసు పైన సామాన్యుల నుంచే విమర్శ రావడంతో పోలీసులు కాస్త వెనక తగ్గారు. పోలీసుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ చెవిరెడ్డి

పోలీసు స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి

మోహిత్ రెడ్డి 41నోటీసు తీసుకుని, ఎవరి మెప్పు కోసం పోలీసులు ఇంత హంగామా చేశారో చెప్పాలని పోలీసులను నిలదీశారు. ప్రతిపక్ష పార్టీ నేతలపై అక్రమ కేసులకు సిద్దపడ్డ ప్రభుత్వంపై చంద్రగిరి నుంచే తిరుగుబాటు మొదలవుతుందని తెలిపారు. విదేశాల్లో చదువుకున్నా.. హుందా రాజకీయం చేయాలనుకున్నా.. ఇప్పుడు ప్రభుత్వ అరాచకాలతో వీధి పోరాటానికి సిద్దమయ్యానన్నట్లు ప్రకటించారు. అక్రమ కేసులు పెట్టిన పోలీసు అధికారులు అందర్నీ న్యాయస్థానంలో నిలబెడతాం, పోలీసు కేసులకు భయపడే ప్రసక్తే లేదు.. తుపాకీ తూటాలకు కూడా భయ పడేది లేదు.. ప్రతిపక్షంలో ప్రజల పక్షాన పోరాడటమే తెలుసు, మా నాన్న చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి స్ఫూర్తితో అన్యాయం, అవినీతి, అక్రమాలపై ఉద్యమిస్తా అని చెవిరెడ్డి మోహిత్ రెడ్డి తెలిపారు. మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ 41 (ఏ) నోటీసు ఇవ్వడానికి లుక్ అవుట్ నోటీసు ఇచ్చారా..? ఏ చట్టంలో ఉందో పోలీసులు చూపాలన్నారు. నా బిడ్డలకు మంచి చేయడం మాత్రమే నేర్పించా, తప్పు చేయడం తెలీదు. పోలీసుల అప్రజాస్వామిక చర్యలపై న్యాయస్థానంలో పోరాడుతా అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలపై చంద్రగిరి నుంచే పోరాటం మొదలవుతుంది. ఒక వ్యక్తి నాటకానికి ఇప్పటికే 36 మందిని జైలు పాలు చేశారు. ఇంకా ఎంత మందిని శిక్షిస్తారు. పోలీసులు చట్టం తెలుసుకుని వ్యవహరిస్తే బాగుంటుంది, అలా కాకుండా చట్ట వ్యతిరేకమైన చర్యలకు పాల్పడితే ఎవ్వరినీ వదిలే ప్రసక్తి ఉండదని హెచ్చరించారు. విదేశాల్లో చదివిన నా కొడుకు హుందాతనం పాటించి ప్రజాసేవకై ముందుకు వచ్చాడు. ఈ ప్రభుత్వం దుర్మార్గమైన చర్యలతో వీధి పోరాటాలకు తీసుకు వచ్చారు. ఇప్పటి వరకు ప్రజల పక్షాన చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిగా తాను ఒక్కడినే పోరాటం చేస్తూ వచ్చా. ఇకపై నా కొడుకుని కూడా పోరాటాలకు సిద్ధం చేశారు. పోలీసు కేసులకు భయపడే వంశం మాది కాదు. జైళ్లు మాకు కొత్త కాదు అన్నారు. ఇకపై ఏదేమైనా సరే ప్రజల్లోనే ఉంటాం.. ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజాక్షేత్రంలో బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

సెజ్‌ల హబ్ గా తిరుపతి..!

- జిల్లాలో ఎనిమిదికి చేరిన సెజ్‌లు

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో

తిరుపతి జిల్లా స్పెషల్ ఎకనామిక్ జోన్లతో ముందుకు వెళ్తుంది. ఇప్పటివరకు నాయుడుపేట, తడ, రేణిగుంట, సత్య వేడు మండలాల్లో 8 ఎకనమిక్ జోన్లు వచ్చాయి. తాజాగా కొలువుదీరిన టిడిపి ప్రభుత్వం మరిన్ని జోన్లు తెచ్చేందుకు విదేశీ, స్వదేశీ కంపెనీల పెట్టుబడులను ఆహ్వానిస్తుంది. త్వరలోనే గూడూరు నాయుడుపేట, సూళ్లూరుపేట, శ్రీకాళహస్తి, తిరుపతి లాంటి పట్టణాలలో భారీ పరిశ్రమలు వస్తాయని అంచనా. లక్షల కోట్లు పెట్టుబడులతో పెట్టే ఈ కంపెనీలు వేలాది మంది యువతకు ఉపాధి కల్పించే అవకాశం ఉన్నట్లు ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. ఇప్పటికే తిరుపతి జిల్లాలో అందులో భారీ పరిశ్రమల నుంచి చిన్నతరహా పరిశ్రమల వరకూ పెద్దఎత్తున కొలువై ఉన్నాయి. శ్రీసిటీ సెజ్ దేశంలోనే అత్యంత విజయవంతమైన సెజ్‌లలో ఒకటిగా నిలిచింది. అంతర్జాతీయస్థాయి కంపెనీలు ఇక్కడ తమ ప్లాంట్లనుపెట్టాయి. అలాగే తిరుపతి జిల్లాలో ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్స్ రెండు ఉన్నాయి. ఈ రెండింటికీ సెజ్ హోదా ఉంది. ఇక మాంబట్టులో ఉన్న సెజ్‌లో పెద్దఎత్తున పరిశ్రమలు వస్తున్నాయి. నాయుడుపేట సెజ్, సీసీఎల్ సెజ్, అపాచీ సెజ్, భారతీయ ఇంటర్నేషనల్ సెజ్‌లు కూడా ఉన్నాయి. వీటిలో పరిశ్రమల స్థాపన వేగంగా జరుగుతోంది.

ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్) నోటిఫై అయిన చోట పరిశ్రమలు పెడితే అనేక ప్రయోజనాలు లభిస్తాయి. ఆర్థిక నిబంధనలు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు అనుకూలంగా ఉంటాయి. ప్రత్యేక ఆర్థిక మండలాలు సాధారణంగా విదేశీ పెట్టుబడులను ఆకర్షించడానికి పెట్టారు. సెజ్‌ల రకాలు ఫ్రీ-ట్రేడ్ జోన్‌లు,

ఇండస్ట్రియల్ పార్కులు, ప్రత్యేక జోన్‌లను కలిగి ఉంటాయి. అందుకే విదేశీ పెట్టుబడిదారులు ఆసక్తి చూపిస్తారు. సెజ్‌ల వ్యవస్థను సక్సెస్ ఫుల్‌గా వినియోగించుకోవడానికి ప్రస్తుత ప్రభుత్వం పూర్తిస్థాయిలో ప్రయత్నాలు చేస్తోంది. విదేశీ పెట్టుబడులను ఆకర్షించడానికి తమ గత ప్రయత్నాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రత్యేకమైన టీమ్ ద్వారా ప్రయత్నాలు చేసేందుకు సిద్ధమవుతోంది.

తప్పు చేసిన వారికి శిక్ష తప్పదు

కక్ష సాధింపులు చేయటం లేదు

ఫిర్యాదు మేరకే పోలీసు వ్యవహరించారు : ఎమ్మెల్యే పులివర్తి నాని

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: తాను నియోజకవర్గంలో ఎలాంటి కక్ష సాధింపులకు పూనుకోవటం లేదని, తప్పుచేసిన వారికి శిక్ష తప్పదని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని తెలిపారు. ఆదివారం అయిన విలేకరులతో మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కుటుంబ సభ్యులపై తాను కక్ష సాధింపు చేస్తున్నానంటూ అపద్దాలను ప్రచారం చేయడం సరైంది కాదన్నారు. మే 14న తనపై హత్యాయత్నం జరిగిన రోజే తాను పోలీసులకు ఫిర్యాదు చేశానని, అందులో ఏ వన్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఏ2 చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, ఏ3 చెవిరెడ్డి రఘునాథరెడ్డి, ఏ4 భాను ప్రకాష్ రెడ్డి పేర్లు ఉన్నాయన్నారు. తాను ఫిర్యాదు చేసినప్పుడు వైసిపి ప్రభుత్వం పాలనలో ఉందని, చెవిరెడ్డి కనుసనలు నడిచే అధికార యంత్రాంగం పనిచేస్తుందని గుర్తు చేశారు. తాను కక్ష సాధింపులకు పూనుకోవాల్సిన అవసరం లేదని, చట్టం తన పని చేసుకుందన్నారు. విదేశాల్లో చదువుకున్నంత మాత్రాన తప్పులు చేస్తే శిక్షించకూడదా అని ప్రశ్నించారు. తాను ఖర్చు సాధింపులు చేయాలంటే, తన వద్ద రెండు బలమైన కేసులు ఉన్నాయని, దానికి సంబంధించిన ఆధారాలన్నీ జూన్ రెండో తారీకు తన వద్దకు చేరాయని తెలిపారు. చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కుటుంబ సభ్యులు లాగా తాను ఎక్కడ భూకబ్జాలకు పాల్పడలేదని, దౌర్జన్యంగా ఇతర ఆస్తులు దోచుకోలేదని, ఇతరులపై దాడులకు దిగలేదని చెప్పారు. శివరెడ్డి భాస్కర్ రెడ్డి కుమారుడు అరెస్టు కావడంతో ఆయన ఆందోళన చేపట్టారని, గతంలో నియోజకవర్గంలో అనేక మందిపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపినప్పుడు ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. 2019 నుండి 2024 జూన్ రెండవ తేదీ వరకు నియోజకవర్గంలో చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సాగించిన దందాలు, మోసాలు అన్నిటికీ సంబంధించిన సాక్షాలు తన వద్ద ఉన్నాయని, వాటిని బయటపెట్టి మీపై చర్యలు తీసుకుంటే పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించమని హెచ్చరించారు. తాను కక్ష సాధింపులకు దిగటం లేదని, ఎమ్మెల్యేగా రాబోయే నాలుగు సంవత్సరాలు నియోజవర్గ అభివృద్ధి పైనే దృష్టి సారించి ఆ దిశగా ప్రయాణం సాగిస్తున్నానన్నారు. తనను విమర్శించిన సహిస్తానని, మా నాయకుడు చంద్రబాబు నాయుడు, లోకేష్‌ను, విమర్శిస్తే ఊరుకునేది లేదన్నారు. నియోజకవర్గంలోని టిడిపి, బిజెపి, జనసేన నాయకులు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అపద్దాలను నమ్మవద్దని సూచించారు.

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

గంధమనేని రమేష్‌కి పలువురి నివాళి

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: నగరి నియోజకవర్గం, ఒరూరుపేటకు చెందిన టీడీపీ నేత గంధమనేని రమేష్ చంద్రప్రసాద్ మతి పట్ల సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. టీడీపీ ఉమ్మడి చిత్తూరు జిల్లా మొదటి అధ్యక్షులుగా రమేష్ చంద్రప్రసాద్ చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఎస్వీ షుగర్స్ ఛైర్మన్‌గా, సమర్థుడైన నేతగా పార్టీ బలోపేతానికి రమేష్ చంద్రప్రసాద్ కషి చేశారని అన్నారు. రమేష్ ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు. వారి కుటుంబ సభ్యులకు సీఎం ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు.

పుత్తూరు టౌన్: టీడీపీ ఉమ్మడి చిత్తూరు జిల్లా మాజీ అధ్యక్షులు గంధమనేని రమేష్ చంద్ర ప్రసాద్ శనివారం రాత్రి పరమపదించారు. సమాచారం అందుకున్న నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ ఆదివారం గంధమనేని రమేష్ చంద్ర ప్రసాద్ స్వగ్రామం నింద్ర మండలం ఓరూరు పేట గ్రామానికి చేరుకొని ఆయన భౌతిక కాయానికి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. కార్యక్రమంలో పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ్‌రెడ్డి, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళిమోహన్, సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, ఎమ్మెల్యే శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే ఎస్‌వి నాయుడు, చిన్న బాబు, తదితరులు రమేష చంద్ర ప్రసాద్ భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

15 నుంచి బిఎస్ఎన్ఎల్ 4జీ సేవలు

- చిత్తూరు జిల్లాలో పెరిగిన వినియోగదారులు
- తక్కువ ధర ఎక్కువ సేవలు
- ప్రజాశక్తితో బిఎస్ఎన్ఎల్ జిఎం సి.అమరేంద్ర రెడ్డి

ప్రజాశక్తి- తిరుపతి టౌన్:

కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదు.. మూలనపడ్డ సంస్థలు అప్పుడప్పుడు తెరుచుకుంటాయి.. మూతపడుతాయనుకున్న సంస్థలు ట్రెండింగ్‌లోకి వస్తాయి.. నిన్నా.. మొన్నటి వరకూ బిఎస్ఎన్ఎల్ అంటేనే ఆసక్తి లేని మొబైల్ కస్టమర్లు.. ఇప్పుడు అదే బిఎస్ఎన్ఎల్ వైపు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. రీజన్ ఒక్కటే కాస్ట్ తగ్గింది.. కస్టమర్లు అట్రాక్ట్ అవుతున్నారు.. సిగ్నల్, డేటా స్పీడ్ ఉండదన్న కారణంతో గతంలో బిఎస్ఎన్ఎల్ అంటేనే ఇష్టపడని కస్టమర్లు ఇప్పుడు మళ్లీ ఆ నెట్‌వర్క్‌కే తమ సిమ్లను పోర్ట్ చేసుకుంటున్నారు. లక్షల మంది కస్టమర్లు మళ్లీ బిఎస్ఎన్ఎల్‌ను ఎంచుకుంటున్నారు. కొత్తగా బిఎస్ఎన్ఎల్ సిమ్లు తీసుకునేవాళ్లు కొందరైతే.. జియో, ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా నుంచి కన్వర్ట్ అవుతోన్న కస్టమర్లు లక్షలమంది ఉన్నారు. బిఎస్ఎన్ఎల్ 4జీ సేవలను కేంద్ర ప్రభుత్వం ఆగస్టు 15 నుంచి ప్రారంభించనుంది. దీంతోపాటు చిత్తూరు జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో బిఎస్ఎన్ఎల్ 4జి సేవలు వినియోగదారులకు అందుతున్నాయని, అయితే తిరుపతి తిరుమలలో ఆగస్టు 15 నుంచి బిఎస్ఎన్ఎల్ సేవలు అందుబాటులో వస్తాయని తిరుపతి జిల్లా బిఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ సి.అమరేంద్ర రెడ్డి ప్రజాశక్తికి తెలియజేశారు. ప్రైవేట్ కంపెనీలు వారివారి సేవలను ధరలు పెంచి వేయడంతో చాలామంది బిఎస్ఎన్ఎల్ వైపు మొగ్గు చూపుతున్నారని తెలిపారు. చిత్తూరు జిల్లా పరిధిలో కేవలం 20రోజుల్లో 3200 మంది ఇతర నెట్వర్క్ సర్వీస్ ఉన్నవారు బిఎస్ఎన్ఎల్‌కు పోర్టు పెట్టుకోవడం జరిగిందన్నారు. వారందరూ బిఎస్ఎన్ఎల్ సిమ్ కార్డు కొనుగోలు కోసం భారీ ఎత్తున వినియోగదారులు వస్తున్నారని చెప్పారు. చిత్తూరు జిల్లాలో 3,25,000 మంది బిఎస్ఎన్ఎల్ వినియోగదారులు కలిగి ఉన్నారని, ఇప్పుడు వారి సంఖ్య మరింత పెరిగిందఅన్నారు. రానున్న రోజుల్లో మరింత బిఎస్ఎన్ఎల్ సిమ్ కార్డులు తీసుకునే అవకాశం ఉందన్నారు. మారుమూల గ్రామాల్లో ప్రైవేటు నెట్వర్క్ ఇవ్వలేని సేవలు బిఎస్ఎన్ఎల్ సేవలు అందిస్తుందని అన్నారు.

ఇంటర్వ్యూ

ప్రజాశక్తి: 4జీ సేవలు ఎప్పుడు అందుబాటులోకి వస్తాయి?

బిఎస్ఎన్ఎల్ జిఎం: చిత్తూరు జిల్లాలో ఆగస్టు 15 నుంచి దేశాంతంగా 4జి సేవలు కేంద్ర ప్రభుత్వం ప్రారంభిస్తుంది. చిత్తూరు జిల్లాలో అదేరోజు బిఎస్ఎన్ఎల్ 4జీ సేవలు ప్రారంభిస్తాం. ఇందులో తిరుపతితో పాటు తిరుమలలో 4జి సేవలు అందుబాటులోకి రానున్నాయి.

ప్రజాశక్తి: 4జి టవర్లు అందుబాటులో ఉన్నాయా?

బిఎస్ఎన్ఎల్ జిఎం: చిత్తూరు జిల్లాలో 406 లొకేషన్ కేంద్రాలు ఉన్నాయి. అందులో 120 టవర్లు గ్రామీణ మారుమూల ప్రాంతాల్లో ఉన్నాయి. 4జి టవర్లు 74 ఉన్నాయి. తిరుపతిలో 60 టవర్లు తిరుమలలో 10 టవర్లు కలిగి ఉన్నాయి. ఈ4జి సేవలు అందిస్తాయి. తిరుపతిలో మరో 70 టవర్లు పెట్టడానికి ప్రాంతాలను పరిశీలిస్తున్నాం.

ప్రజాశక్తి: బిఎస్ఎన్ఎల్ వినియోగదారుల సంఖ్య ఎంతవరకు పెరిగింది.

బిఎస్ఎన్ఎల్ జిఎం: చిత్తూరు జిల్లాలో 19 రోజులుగాను పదివేల మంది కొత్త సిమ్ కార్డులు ఇవ్వడం జరిగింది. ప్రైవేట్ ఆపరేటర్లు రీఛార్జ్ ధరలు పెంచడం వల్ల చాలా మంది బిఎస్ఎన్ఎల్ 4జీ సేవల కోసం తమ సిమ్ కార్డులను తీసుకోవడానికి ఎగబడుతున్నారు. వినియోగదారుల్లో ఆదరణ పెరిగింది.

ప్రజాశక్తి: బిఎస్ఎన్ఎల్ ల్యాండ్ లైన్ ఫోన్లు తగ్గడానికి కారణం ఏమిటి?

బిఎస్ఎన్ఎల్ జిఎం: బిఎస్ఎన్ఎల్ ల్యాండ్ లైన్ తగ్గడానికి కారణం 2జి, 3జి, 4జి సేవలు రావడం ఓ కారణం. గతంలో 30 వేల ల్యాండ్ లైన్ ఫోన్లు ఉంటే, ప్రస్తుతం 4వేల ల్యాండ్ లైన్ ఫోన్లు ఉన్నాయి. ల్యాండ్ లైన్ తగ్గడానికి కారణం వినియోగదారులు ఆదరణ బట్టి ఉంటుంది.

ప్రజాశక్తి: బిఎస్ఎన్ఎల్ సేవల్లో అంతరాయం కలగడానికి కారణం ఏంటి?

బిఎస్ఎన్ఎల్ జిఎం: బిఎస్ఎన్ఎల్ సేవలు అప్పుడప్పుడు కొన్ని సందర్భాల్లో అంతరాయం కలగడానికి కారణం శ్రీకాళహస్తి, చెన్నై ,పుత్తూరు, వీకోట వంటి ప్రాంతాల్లో గ్యాస్ పైప్ లైన్లు పనులు జరుగుతుండడంతో బిఎస్ఎన్ఎల్ కేబుల్ తెగిపోయి. సేవలకు అంతరాయం కలుగుతోంది. వాటిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించి పనులు చేస్తున్నాం.

ప్రజాశక్తి: బిఎస్ఎన్ఎల్ వాట్సాప్ నెంబర్ ఎలాంటి ఉపయోగం ఉంది.

బిఎస్ఎన్ఎల్ జిఎం: బిఎస్ఎన్ఎల్ ఫైబర్ సొల్యూషన్ కావాలంటే వాట్సాప్ నెంబర్ 1800 4444 తెలియజేయాలి. బిఎస్ఎన్ఎల్ వినియోగదారులు ఈ నంబర్‌ను డౌన్లోడ్ చేసుకుంటే ఉపయోగం ఉంటుంది.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

ఎమ్మెల్యేకి సిఐటియు వినతి

ప్రజాశక్తి- తిరుపతి సిటీ, తిరుపతి టౌన్: భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ భవన నిర్మాణ కార్మిక సంఘం (సీఐటీయూ) ఆధ్వర్యంలో ఆ సంఘం నాయకులు తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కలిసి వినతిపత్రం అందించారు. స్థానిక ఎన్జీవో కాలనీలోని ఎమ్మెల్యే నివాసం వద్ద ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం 2009 నుంచి భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డులను ఏర్పాటు చేసి అనేక పథకాలను అమలు చేస్తుందన్నారు. గత ప్రభుత్వం అధికారానికి వచ్చిన వెంటనే ఇసుక బ్యాన్ చేసి కార్మికులు ఉపాధి కోల్పోయారని, కరోనా కాలంలో లక్షలాది కుటుంబాలు వీధినపడ్డాయని, ప్రభుత్వం ద్వారా ఎటువంటి సహాయం అందలేదని, బోర్డులో ఉన్న డబ్బులు కరోనాకాలంలో అర్హులైన కార్మికులకు రూ.10వేలు సహాయం చేయమని పలుమార్లు ప్రభుత్వానికి విన్నవించుకున్నారని తెలిపారు. కార్మికులకు సహాయం చేయకపోగా సంక్షేమ బోర్డు నుండి డబ్బులు మొత్తం గత ప్రభుత్వం దారి మళ్ళించిందని, అంతటితో ఆగకుండా ఎటువంటి క్లైములను మంజూరు అయిన వాటిని కూడా ఇవ్వవద్దని కొత్త క్లైమను తీసుకోవద్దని మేము 1214ను ఇచ్చి కార్మికులకు ద్రోహం చేసిందన్నారు. గత ప్రభుత్వాలు సంక్షేమ బోర్డు నుండి ఇతర పథకాలు వాడుకున్న 3050 కోట్ల నిధులను తిరిగి బోర్డులో జమ చేయాలి అర్హులైన అందరికీ సంక్షేమ బోర్డులో రిజిస్టర్ చేయాలని, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కోరారు. పెండింగ్లో ఉన్న క్లైమ్లను మంజూరు చేయాలని 2019 నుండి అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.శ్రీనివాసులు, పి.మునిరాజా తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో అదనపు ఈవో విస్తృత తనిఖీలు

ప్రజాశక్తి- తిరుమల: టీటీడీ అదనపు ఈవో సిహెచ్ వెంకయ్యచౌదరి ఆదివారం సాయంత్రం తిరుమలలోని పలు ప్రాంతాలను, దర్శన క్యూలైన్లను క్షుణ్ణంగా పరిశీలించారు. ఇందులో భాగంగా ఆల్వార్ ట్యాంక్ అతిథి గృహాల వద్ద వున్న ఎస్ఎస్‌డి క్యూలైన్లు, టోకెన్ తనిఖీ కేంద్రాలను పరిశీలించారు. తరువాత వైకుంఠం క్యూకాంప్లెక్స్- 1,2లోని కంపార్ట్‌మెంట్లు, సుపథం వద్ద చిన్నపిల్లల తల్లిదండ్రులు, దాతలతోపాటు వివిధ దర్శనాలను సంబంధిత అధికారులు ఆయనకు క్షుణ్ణంగా వివరించారు. అనంతరం ఎస్ఇడి క్యూ లైన్లను, ఫోటో క్యాప్చర్ తదితరాంశాలను పరిశీలించారు. అదనపు ఈవో వెంట ఎస్ఈ-2 జగదీశ్వర్‌రెడ్డి, డిప్యూటీ ఈవోలు లోకనాథం, ఆశాజ్యోతి, ట్రాన్స్‌పోర్ట్ జీఎం. శేషారెడ్డి, విజీఓలు నందకిషోర్, గిరిధర్ రావు ఇతర అధికారులు ఉన్నారు.

చెరువులో మట్టి దొంగలు పడ్డారు

- జెసిబి వాహనాలు, ట్రాక్టర్ల ద్వారా రాత్రుల్లో మట్టి లూటీ...
- మొద్దు నిద్రలో సత్యవేడు ఇరిగేషన్ శాఖ అధికారులు

ప్రజాశక్తి- సత్యవేడు: సత్యవేడు పట్టణం దలవాయి అగ్రహారం చెరువులో మట్టి దొంగలు రాత్రికి రాత్రే అక్రమంగా తరలిస్తున్నట్లు స్థానికులు తెలిపారు. పట్టణీకరణ నేపథ్యంలో ఇసుకతో పాటు మట్టికి మంచి డిమాండ్ పెరగడంతో దీన్ని ఆసరా చేసుకుని కొందరు మట్టి దొంగలు దలవాయి అగ్రహారం చెరువులో శనివారం రాత్రి 10 గంటల నుండి రెండు జెసీబీ వాహనాలను పెట్టి సుమారు 15 నుండి 20 ట్రాక్టర్లతో ఆదివారం ఉదయం నాలుగు గంటల వరకు గుట్టుచప్పుడుగా మట్టిని తరలించినట్లు స్థానికులు తెలిపారు. ఎలాంటి అనుమతులు తీసుకోకుండా రాత్రికి రాత్రే ప్రభుత్వ భూముల్లోనూ చెరువుల్లో మట్టిని తవ్వి అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకోవడం, వీరిపై అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం రివాజ్‌గా మారింది. ఇంటి లెవెలింగ్ కోసమని పేదోళ్లు ఒక ట్రాక్టర్ మట్టిని తరలిస్తే ఆగ మేఘాలపై ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు అక్కడికి చేరుకొని సీజ్ చేసి అక్రమాలను అడ్డుకున్నట్టు పత్రికా స్టేట్మెంట్లు ఇస్తారే తప్ప, అనుమతులు లేకుండా త్రవ్వకాలు జరిపి అక్రమంగా మట్టిని తరలిస్తున్న మట్టి దొంగలను మాత్రం చూసి చూడనట్లుగా అధికారులు వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. ఇటీవల పలుగ్రామాల చెరువులలో మట్టిని అక్రమంగా తరలిస్తున్నా సంబంధిత ఇరిగేషన్ అధికారులు మొద్దునిద్ర వీడడం లేదన్న విమర్శలున్నాయి. పైగా కాసుల కోసం కక్కుర్తిపడి మట్టి స్మగ్లర్లతో లాలూచీ పడటం వల్లనే ఇలాంటి పరిస్థితులు ఏర్పడుతున్నట్లు విమర్శలు లేకపోలేదు. పైగా ఈ మట్టి అక్రమ రవాణాకు స్థానిక నాయకులు కొందరు తెరతీసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత ఇరిగేషన్ రెవెన్యూ అధికారులు స్పందించి దలవాయి అగ్రహారం చెరువులో మట్టి అక్రమ తరలింపు గురికాకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-వరదయ్యపాళ్యం: శ్రీరామచంద్రా మెడికల్ సెంటర్ (ఎస్ఆర్ఎంసి), శ్రీసిటీ ఫౌండేషన్, పాండూరు శ్రీకోదండరామ స్వామి సేవా సంఘం సంయుక్త ఆధ్వర్యంలో వరదయ్యపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రజల వద్ద నుంచి విశేష స్పందన లభించిందని నిర్వాహకులు తెలిపారు. చెన్నై శ్రీరామచంద్రా హాస్పిటల్స్ ప్రత్యేక వైద్య నిపుణుల బృందం ఇందులో వైద్య సేవలు అందించారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సాగిన శిబిరంలో 369 మందికి వివిధ రకాల వైద్య చికిత్సలు జరిపి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-గూడూరు టౌన్: పట్టణంలోని జనార్ధన్ రెడ్డి కాలనీలో బైరి వెంకటేశ్వర్లు మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ అంత్య క్రియలకు రూ.5వేలను అందించారు. స్థానిక నాయకులు తక్కెళ్ళ పాటి చంద్ర మౌళి, మైనం పాటి మోహన్, కాశీ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను ఐక్యం చేద్దాం: ఏఐటీయూసీ

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్, నారాయణవనం: కార్మికులను ఐక్యం చేద్దాం, సమస్యలపై సమరం చేద్దాం అని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పుత్తూరు డివిజన్ ఏఐటియుసి జనరల్ బాడీ సమావేశం పుత్తూరు అంబేద్కర్ భవన్‌లో నిర్వహించారు. సమావేశానికి మహేష్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షులు ఎన్.చంద్రశేఖర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణలు హాజరైయ్యారు. వారు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను శరవేగంగా అమలు పరుస్తుందని దీనివల్ల బ్రిటిష్ కాలం నుంచి పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను పెట్టుబడి దారులకు అనుకూలంగా మోడీ ప్రభుత్వం అన్ని రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చి అన్ని రాష్ట్రాల్లో అమలుకు ప్రయత్నం చేస్తుందని దీనికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఏఐటియుసి ఆధ్వర్యంలో రానున్న కాలంలో పోరాటాలకు సన్నద్ధమవుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు మహేష్ ,హేమావతి, ముకుంద, రమణ, మారెమ్మ, వెంకట రమణమ్మ, రమేష్, సుబ్రమణి, గోపి తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: హెల్పింగ్ హాండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక ప్రతిభావంతులకు నిత్యవసర సరుకులను పంపిణీ చేశార. గత 151 నెలల సుధీర్ఘకాలంగా పేదలకు, ప్రత్యేక ప్రతిభావంతులకు వివిధ రకాలుగా సాయపడటం ఆనందంగా ఉందని సంస్థ నిర్వాహకుడు మునీర్ బాషా తెలిపారు. బిజెపి సీనియర్ నాయకులు గరికిపాటి రమేష్, ఏడు గంగమ్మ జాతర కమిటీ అధ్యక్షులు స్వర్ణ మూర్తి, బాబా ఫరీద్, హరి నాయుడు, హెల్పింగ్ హాండ్ సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

వడ్డెరలను గుర్తించాలి: బాలశేఖర్

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: ఎన్‌డీఏ ప్రభుత్వంలో వడ్డెరలను గుర్తించి నామినేటెడ్ పదవులు ఇవ్వాలని తిరుపతి జిల్లా వడ్డెర సంఘం ప్రధాన కార్యదర్శి తన్నీరు బాల శేఖర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తగిన గుర్తింపునిచ్చి రాజకీయంగా అవకాశాలు కల్పిచాలన్నారు.

భక్తి శ్రద్ధలతో భరణి కావడి

ప్రజాశక్తి-విజయపురం: మండలంలో భక్తి శ్రద్ధలతో భక్తులు సుబ్రహ్మణ్యం స్వామికి ఆదివారం కావడి తీశారు. మండలంలోని కళియంబాకం, పన్నూరు, ఆమగుంట, తెల్లగుంట, విజయపురం, ఎం.అగరం, కేవీపురం, కాళికాపురం, ఆలపాకం గ్రామాల్లో కావడి తీశారు. భక్తులు రామగిరి, తిరుత్తణి సుబ్రహ్మణ్యంస్వామి ఆలయాలకు భక్తులు తరలి వెళ్లారు.

భక్తులతో కిటకిటలాడిన బోయకొండ

ప్రజాశక్తి-సోమల: చౌడేపల్లి మండలంలోని ప్రముఖ శక్తి క్షేత్రమైన బోయకొండ గంగమ్మను దర్శించుకోవడానికి ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో ఉదయం 6గంటలకు బారులు తీరారు. భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా అమ్మవారిని దర్శించుకోవడానికి మొక్కులు తీర్చుకోవడానికి ముడుపులతో క్యూలైన్లను మహిళలు అధిక సంఖ్యలో వచ్చారు. ఆదివారం సెలవు రోజు కావడంతో స్కూల్ విద్యార్థులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు కావలసిన ఏర్పాట్లును ఈవో ఏకాంబరం పర్యవేక్షించారు. అర్చకులు గంగిరెడ్డి కృష్ణప్ప, సుధాకర్, రాము, రాజన్న, ప్రసాద్, చిన్న గంగిరెడ్డి ఆలయ సిబ్బంది రామనాథం, వీరకుమార్, కృష్ణారెడ్డి, సుధాకర్ రెడ్డి, సురేందర్ రెడ్డి, సూరి, తాతయ్య పాల్గొన్నారు.



తెలుగు తమ్ముళ్ల శుభాకాంక్షలు

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: మండలంలోని తూగుండ్రం గ్రామానికి చెందిన టిడిపి నాయకులు, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి భీమ నేని చిట్టిబాబు నాయుడు పుట్టిన రోజు సందర్భంగా పలువురు టిడిపి నాయకులు ఆదివారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన జన్మదినాన్ని పురస్కరించుకొని తూగుండ్రం గ్రామానికి చెందిన తెలుగు తమ్ముళ్లు పార్లమెంట్ టిఎన్‌టియుసి అధికార ప్రతినిధి జీవరత్నం, మండల క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు శాంత కుమార్, తూగుండ్రం గ్రామ కమిటీ ప్రధాన కార్యదర్శి సంపత్ పాలసముద్రంలో అతని నివాసంలో కలిసి

శాలువా కప్పి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు నాయకులు నరసింహులు నాయుడు, అరుల్ పాల్గొన్నారు.

ఐటీఐ కళాశాల చుట్టూ వర్షపు నీరు

ప్రజాశక్తి-విజయపురం: మండలంలోని మాధవరం ప్రభుత్వ ఐటిఐ కళాశాల చుట్టు వర్షపు నిలిచి కదలడం లేదు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిలిచి ఉన్న వర్షపు నీటి నుంచి దుర్వాసన వస్తోంది. అధికారులు స్పందించి గ్రావెల్ నింపి గుంతలు పూడ్చాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

హైకోర్టు న్యాయవాదికి ఘన సన్మానం

ప్రజాశక్తి-రామకుప్పం: రాష్ట్ర హైకోర్టు ప్రభుత్వ న్యాయవాది శరత్ కుమార్‌ను రాష్ట్ర టిడిపి నేత మునస్వామి, ఇతర నేతలు ఆయనను ఘనంగా సన్మానించారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో శరత్‌కుమార్‌ను గుర్తించి ప్రభుత్వ అడ్వకేట్‌గా గుర్తించడం శుభ పరిణామం ఉన్నారు. ప్రభుత్వ ఆస్తులు పరిరక్షించేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం దుశ్శాలువలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

కార్యక్రమంలో జయశంకర్, సత్తి, మహేంద్ర నాయుడు పాల్గొన్నారు.

నరసింహులురెడ్డికి నివాళి

ప్రజాశక్తి-విజయపురం: మండలంలోని కాళికాపురం పంచాయతీకి చెందిన వైసీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ రమేష్‌రెడ్డి తండ్రి నరసింహులు రెడ్డి ఆనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందాడు. ఆదివారం మాజీ మంత్రి ఆర్కే రోజా సోదరుడు రాంప్రసాద్‌రెడ్డి, నాయకులు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను కలిసి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన వెంట నాయకులు పాండియన్, గౌతమ్, వినోద్‌కుమార్, ముత్తప్పరెడ్డి, ఉప సర్పంచ్ జీ.రవి, యుగేందర్, కృష్ణమూర్తి ఉన్నారు

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

పజాశక్తి-సోమల: చౌడేపల్లి మండలంలోని రెండు వేర్వేరు ఉన్నత పాఠశాలలో చదువుకున్న పూర్వవిద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. చౌడేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1965-66 ఎస్ఎస్ఎల్‌సీ బ్యాచ్ అపూర్వ కలయిక ఆనందోత్సాహాల మధ్య ఆదివారం జరిగింది. వృద్దాప్యం లో నడవలేక, సరిగా చూపు కనబడక, కళ్ళద్దాలను సరిచేసుకుంటూ, ఒకరినొకరు గుర్తుపట్టుకొని, నాటి కొంటె పనులను మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ, తమ జీవన శైలిని ఒకరికొకరు ముచ్చటించుకుంటూ గడిపారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకొని సంతోషంగా గడిపారు. అలాగే మండలంలోని మేకలచిన్నేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదివిన 2005-06 పదవ తరగతి పూర్వ విద్యార్థులు అందరూ పాఠశాలలో కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయానురాగాలతో పిలుచుకొని క్షేమ సమాచారాలు అడిగి తెలుసుకున్నారు.

వేగం కంటే ప్రాణం ముఖ్యం

ప్రజాశక్తి-విజయపురం: వేగం కంటే ప్రాణం ముఖ్యమని ఎస్ఐ జయప్ప అన్నారు. ఆదివారం పన్నూరు సబ్‌స్టేషన్‌లో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా కారు, ఆటో, స్కూటర్‌లను క్షుణంగా పరిశీలించారు. సీటు బెల్ట్, హెల్మెట్ లేకుండ వాహనం నడపకూడాదని సూచించారు. ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులకు ఎక్కించకూడదన్నారు. అతి వేగం కారణంగా తరచూ రోడ్డు ప్రమాదం జరుగుతున్నాయని గుర్తు చేశారు. రోడ్డు నిబంధనలను పాటించడంతో పాటు వాహనానికి సంబంధించిన రికార్డు అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. అలాగే మద్యం సేవించి, లైసెన్స్ లేకుండ, మైనార్‌లకు బండి ఇచ్చినా కేసు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. ఆయన వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

వైష్ణవీ దేవి ఆలయంలో ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-సోమల: చౌడేపల్లి మండలంలోని పుదిపట్లలో వెలసివున్న వైష్ణవీ దేవి ఆల యంలో ఆషాడమాసం చివరి ఆదివారం సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అర్చకురాలు శ్రావణి ఉదయాన్నే ఆలయంలోని ఆంజనేయ స్వామి వారిని, వైష్ణవి దేవి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పంచామృతాభిషేకాలు చేశారు. అశేష సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ దాత వినోద్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నాయకుడు ప్రభాకర్ రాజు మృతి

ప్రజాశక్తి-విజయపురం: మండలంలోని జగన్నాథపురంలో టీడీపీ సీనియర్ నాయకుడు ప్రభాకర్రాజు ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన టీడీపీ అభివృద్ధి కోసం అహర్నిషలు కృషి చేసి, గ్రామంలో పార్టీ పటిష్టతకు కృషి చేశారు. ఆయన మృత దేహానికి నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్, చిత్తూరు పార్లమెంటు అధికార ప్రతినిది చినబాబు పూలమాల వేసి నివాళులర్పించారు. మండల టీడీపీ నాయకులు పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

వీధి దీపాలు ఏర్పాటు

ప్రజాశక్తి -సోమల: సోమల మండలం అన్నెమ్మ గారి పల్లిలో వీధి దీపాలు ఏర్పాటు చేసినట్లు పంచాయతీ కార్యదర్శి లలిత తెలిపారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలో పంచాయతీ పరిధిలో అక్కడక్కడా వీధి దీపాలు వెలగక పోవడంతో నూతన వీధి దీపాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పంచాయతీ పరిధిలోని అనేక గ్రామాలలో మురుగునీటి కాలువలను శుభ్రం చేశామని, పిచ్చి మొక్క లు తొలగిస్తున్నామన్నారు. ప్రజలకు అంటువ్యాధుల వల్ల కలిగే నష్టాల గురించి వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.

నేడు పెద్ద ఉప్పరపల్లి గంగ జాతర

ప్రజాశక్తి -సోమల: సోమల మండలం పెద్ద ఉప్పరపల్లిలో సోమవారం గంగ జాతర నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. ఆదివారం సాయంత్రం అమ్మవారిని దిగువ వీధిలో ప్రతిష్టించి సోమవారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక నైవేద్యం, పొంగళ్లు సమర్పించి సాయంత్రం అమ్మవారి విగ్రహాన్ని ఊరేగించి జలాధివాసం నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. గంగ జాతర కోసం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్టు వారు తెలిపారు.

సదుంలో ఆడికృత్తిక మహోత్సవాలు

ప్రజాశక్తి-సదుం: మండలంలోని గార్గేయ నది వడ్డున వెలిసిన శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యం స్వామి దేవాలయంలో "ఆడి కృత్తిక మహోత్సవాలు" ఆదివారం నుంచి 1వ తేది వరకు జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం ధ్వజారోహణ అంగరంగ వైభవంగా జరిగింది.

ఆకట్టుకున్న దుర్యోధన వధ

ప్రజాశక్తి-వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లంలో జరుగుతున్న వార్షిక మహాభారత మహోత్సవంలో భాగంగా ఆదివారం దుర్యోధన వద కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. కార్యక్రమానికి వైసీపీ నాయకులు నరేష్ రెడ్డి, సురేష్ రెడ్డిల కుటుంబ సభ్యులు ఉభయదారులకు వ్యవహరించారు. సాయంత్రం అగ్నిగుండ ప్రవేశం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

పరమాలలో వైభవంగా దుర్యోధన వధ

ప్రజాశక్తి-రామచంద్రపురం(తిరుపతి రూరల్): తిరుపతి రూరల్ మండలం పరమాల, పేరూరు గ్రామాలలో శ్రీ ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి మహాభారత ఉత్సవాల్లో భాగంగా ఆదివారం దుర్యోధన వద వైభవంగా జరిగింది. ఆదివారం శ్రీ ద్రౌపది సమేత ధర్మరాజుల స్వామి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పి.అశోక్ భీముని పాత్ర, కిరణ్ దుర్యోధన పాత్రల వేషధారణలలో అలంకరించారు. మంగళ వాయిద్యాలు, తపాకాయల పేలుస్తూ దుర్యోధనుడిని భీముడు తరుముకొంటూ దుర్యోధుని మట్టి ప్రతిమ వద్దకు లాక్కుని వచ్చాడు. మహాభారత యుద్ధంలో ఓడిపోయిన దుర్యోధను గంగ మడుగులో దాక్కుని ఉండగా భీముడు దుర్యోధనుడుతో యుద్ధం చేసి వధించిన ఘటం ప్రేక్షకులను అలరింపజేసింది. ఈ దుర్యోధన పౌరాణిక ఘట్టాన్ని తొలగించడం కోసం వివిధ ప్రాంతాల నుంచి ప్రేక్షకులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. మహాభారత ఉత్సవాలు ముగింపు సందర్భంగా సాయంత్రం 6గంటలకు అగ్రిగుండా ప్రవేశ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో సాగింది. పేరూరులో వైభవంగా జరుగుతున్న మహాభారతం ఉత్సవాలకు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని పట్టు వస్త్రాలు సమర్పించారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక చర్యలు

- మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎంఎన్ రెడ్డి

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పట్టణంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎంఎన్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని స్థానిక తిరుపతి రోడ్డులో రోడ్లపై అక్రమంగా బంకులు ఏర్పాటు చేసుకొని ఇబ్బంది కలిగిస్తున్న వారిని హెచ్చరించారు. అక్కడ పారిశుద్ధ్యంపై ఇబ్బంది లేకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. పట్టణంలోని పలు చోట్ల కూరగాయల మార్కెట్, అంబేద్కర్ విగ్రహ కూడలి, ప్రభుత్వాసుపత్రి, టీబి రోడ్లలో పర్యటించారు. కూరగాయల వ్యాపారులు, వర్తకదారులు చెత్తను విధిగా సంబంధిత చెత్తబుట్టలో మాత్రమే వేయాలని రోడ్లపై పడేయరాదని వారికి సూచించారు. మురుగునీటి కాలువలలో పూడికతీత పనులు పరిశీలించి దోమల నియంత్రణ కోసం చర్యలు చేపట్టాలని పారిశుద్ధ్య సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ ఇంద్ర, పారిశుధ్య కార్యదర్శులు, మేస్త్రీలు పాల్గొన్నారు.

మహనీయుల పేర్లతో ప్రభుత్వ పథకాలు హర్షణీయం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: భావి తరాలకు స్ఫూర్తిని అందించే సమాజ సేవకులు, శాస్త్రవేత్తలు, విద్యావేత్తల పేర్లతో ప్రభుత్వ పథకాలను అమలు చేయడం హర్షణీయమని జనసేనపార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శి అంజూరు చక్రధర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర విద్యాశాఖలో పథకాలను డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్, డొక్కా సీతమ్మ, అబ్దుల్ కలాం పేర్లతో అమలు చేయాలని నిర్ణయం తీసుకున్న సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం కొణిదల పవన్ కల్యాణ్, మంత్రి లోకేష్‌కు ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు. గత ప్రభుత్వ పాలనలో అన్ని పథకాలకు ముఖ్యమంత్రి తన పేరే పెట్టుకొన్నారనీ, ఆ దుస్సంప్రదాయానికి మంగళం పాడి విద్యార్థులలో స్ఫూర్తిని కలిగించే వారి పేర్లతో పథకాలు అమలు మంచి పరిణామమన్నారు.

అబ్బూరి నాగుల నాయుడుకి నివాళి

ప్రజాశక్తి-రామచంద్రపురం(చంద్రగిరి): టీడీపీ సీనియర్ నాయకుడు, శతాధిక వృద్ధుడు అబ్బూరి నాగులు నాయుడు (101)కి చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని నివాళులర్పించారు. ఆదివారం చంద్రగిరి మండలం, భీమవరం పంచాయతీ, చిన్నరామాపురం గ్రామం పాతపాటి వారిపల్లిలో శతాధిక వృద్ధుడు, పార్టీ సీనియర్ నాయకుడు అబ్బూరి నాగుల నాయుడు దశదిన కర్మక్రియలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, టీడీపీ నాయకులు హాజరై చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల నాయకులు సుబ్రహ్మణ్యం నాయుడు, ఎస్.గౌస్ బాషా, రమేష్ రెడ్డి, మొక్కల చంద్రశేఖర్ రెడ్డి, లోకాద్రి నాయుడు, బాలకృష్ణ నాయుడు, ప్రతాప్ నాయుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'డాలర్స్ దివాకర్ రెడ్డి యువతకు ఆదర్శం'

ప్రజాశక్తి-రామచంద్రాపురం: టీడీపీ సీనియర్ నాయకులు, ప్రముఖ వ్యాపారవేత్త, డాలర్స్ గ్రూప్స్ అధినేత దివాకర్ రెడ్డి యువతకు ఆదర్శమని టీడీపీ నాయకులు కె.గిరిధర్ రెడ్డి, రామిరెడ్డి, మధు రెడ్డిలు అన్నారు. ఆదివారం డాలర్స్ దివాకర్ రెడ్డి 42వ జన్మదిన వేడుకలను సి.రామాపురంలో నాయకులు భారీ కేక్‌ను కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ టీడీపీ అభివృద్ధికి ఆయన చేసిన కృషిని కొనియాడారు. చంద్రగిరి నియోజకవర్గ గెలుపులో ఆయన కృషి ఎనలేనిదని తెలిపారు. ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపట్టి, పేద బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్నారన్నారు. తల్లిదండ్రులు లేని అనాథ పిల్లలకు అండగా.. పేద విద్యార్థులకు విద్యాభివృద్ధి కోసం ఆర్థిక సహాయాలు చేసి ఆదుకుంటున్నారని కొనియాడారు. అనంతరం పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో రంజిత్ కుమార్ రెడ్డి, తిమ్మాపురం మధురెడ్డి, అమర్నాథ్ రెడ్డి, వెంకీ, నరసింహా రెడ్డి, కొల్లంగుంట మునిరామిరెడ్డి, ధనుంజయ రెడ్డి, గిరిధర్ రెడ్డి, అమర్నాథ్ రెడ్డి, సురేష్ రెడ్డి, వెంకట కృష్ణరెడ్డి, రవి, ముద్దుకృష్ణారెడ్డి, రాజారెడ్డి పాల్గొన్నారు.

లారీని ఢీకొని టెంపో ట్రావెలర్ బోల్తా

- పలువురికి గాయాలు

ప్రజాశక్తి-రామచంద్రపురం(చంద్రగిరి): చంద్రగిరి మండలం హెరిటేజ్ పాల ఫ్యాక్టరీ సమీపం జాతీయ రహదారిపై ఆదివారం రోడ్డు ప్రమాదం జరిగింది. తెలంగాణ రాష్ట్రం, హైదరాబాద్‌కు చెందిన టెంపో ట్రావెలర్ వాహనంలో మొత్తం 12మంది ప్రయాణిస్తున్నారు. వీరు తిరుపతి నుంచి కాణిపాకం దేవాలయానికి వెళ్తున్న సమయంలో, టెంపో డ్రైవర్ ముందు వెళ్తున్న లారీని వెనక నుంచి ఢీ కొట్టి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ (50)కు అతని పక్కనే కూర్చొని ఉన్న మోహన్ కృష్ణ (44)కు తీవ్ర రక్త గాయాలయ్యాయి. పి.సరిత (45), వి.పద్మావతి, (40), హైమవతి (50), హర్షిత్ రెడ్డి (18) గాయాలు కాగా, మిగిలిన వారికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది ఈ.ఎం.టి. కె.రఘుపతి, పైలట్ వేణుగోపాల్ ఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన వారికి ప్రథమ చికిత్సను అందించి మెరుగైన చికిత్స కోసం తిరుపతి, రుయా హాస్పిటల్‌కు తరలించారు. సమాచారం అందుకున్న చంద్రగిరి ఎస్ఐ అనిత తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును క్షుణ్ణంగా పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు.

కారు బోల్తా.. నలుగురికి గాయాలు

ప్రజాశక్తి-పలమనేరు: దైవదర్శనానికి వచ్చి కాణిపాకం నుంచి బెంగళూరుకు తిరిగి వెళుతున్న కారు గంగవరం మండలం ఫ్లై ఓవర్ వద్ద బోల్తా పడింది. వివరాల్లోకెళితే.. కర్నాటక రాష్ట్రం బెంగళూరు నుంచి 6మంది భక్తులు తిరుపతికి వచ్చి దర్శనానంతరం కాణిపాకం చూసుకొని బెంగుళూరుకు ఆదివారం మధ్యాహ్నం తిరుగు ప్రయాణమైయ్యారు. మార్గమధ్యలో గంగవరం మండలం ఫ్లైఓవర్ వద్దకు చేరుకొనే సరికి కారు టైరు పంచర్ అయింది. రన్నింగ్‌లో పంచర్ కావడంతో కారు అదుపు తప్పి మూడు పల్టీలు కొట్టింది. ప్రమాదంలో నలుగురు గాయపడగా వారిని పలమనేరు ఆసుపత్రికి తరలించారు. అందులో యశ్వంత్(10), మోహన్(43)ల పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యులు వారిని చిత్తూరు ఆసుపత్రికి రెఫర్ చేశారు.

మానవత్వం చాటుకున్న సర్వేయర్

పలమనేరు తహశీల్దార్ కార్యాలయంలో పని చేస్తున్న సర్వేయర్ నరేష్ మానవత్వాన్ని చాటుకున్నారు. ఆదివారం గంగవరం ఫ్లైఓవర్ వద్ద చోటుచేసుకున్న ప్రమాదంలో గాయపడిన వారిని హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ప్రజాశక్తి-పుంగనూరు: అగస్త్రీశ్వర స్వామి ఆలయానికి స్నేహితులతో కలిసి ద్విచక్ర వాహ నంలో వెళుతూ ప్రమాదవశాత్తు విద్యుత్ స్తంభా న్ని ఢీకొని ఆదివారం యువకుడు మృతి చెందా డు. వివరాలు ఇలా.. పుంగనూరు పట్టణం చింత ల వీధికి చెందిన సురేష్ కుమారుడు రామ్ చరణ్ (19) తన స్నేహితులు సందీప్, ప్రదీప్‌తో కలిసి ద్విచక్ర వాహనంలో అగస్త్రీశ్వర స్వామి కొండకు వెళ్తుండగా మార్గమధ్యలోని బండ్లపల్లి క్రాస్ వద్ద వాహనం అదుపుతప్పి విద్యుత్ స్తంభానికి ఢీకొన్నది. ఈ ప్రమాదంలో రాంచరణ్ అక్కడిక్కడే మృతి చెందగా, సందీప్ ప్రదీప్‌లకు తీవ్ర గాయాలు కావడంతో ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. పుంగనూరు పోలీసులు కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శవాన్ని పోస్టుమా ర్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రి తరలించారు.

పాయలగుట్ట..సమస్యల తిష్ట..

- బోరు బావిలో అడుగంటిన భూగర్భ జలాలు
- అలంకార ప్రాయంగా ట్యాంకు
- సిమెంటు రోడ్లు, వీధి కాలువలు కరువు
- వున్న పది కుటుంబాలూ కూలీలే.. సెంటు భూమిలేని వైనం
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి -సోమల: సోమల మండలం ఇరికిపెంట పంచాయతీ పాయలగుట్ట గ్రామంలో సమస్యలు తిష్ట వేశాయి. దీంతో గ్రామస్తులు పలు ఇబ్బందులకు గురి అవుతున్నారు. గ్రామంలో పది కుటుంబాలు, దాదాపు 25 మంది జనాభా ఉన్నారు. గ్రామానికి తాగునీటిని సరఫరా చేసే బోరు బావిలో నీరు అడుగంటి పోయింది. రెండు నెలలుగా తాగునీరు లేక ఇబ్బందులు ఎదుర్కొంటు న్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో బోరు బావిలో నీరు పుష్కలంగా వచ్చేవని నీటిని ట్యాంకు ద్వారా సరఫరా చేసి ట్యాంకు నుండి ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్ ద్వారా నీటిని పట్టుకునే వారమని రెండు నెలల క్రితం బోరులో నీరు తగ్గి గ్రామానికి చాలడం లేదని నీటి కోసం చాలా ఇబ్బందులు పడుతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే స్పందించి రోజువారి కూలీలుగా జీవనం సాగిస్తున్న తమకు సెంటు భూమినైనా ఇప్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గ్రామం మొత్తం పది ఇళ్లు వున్నాయి. వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా వున్న సమయంలో తమకు ఇళ్లు మంజూరు అయ్యాయని గృహాలు కట్టిస్తామని గుత్తేదారుడు బిల్లులు మాత్రం చేసుకొని ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయకుండా అసంపూర్తిగా చేసి వెళ్లి పోయాడని గ్రామస్తులు తెలిపారు. ప్రస్తుతం వర్షం వస్తే ఇళ్లు మొత్తం ఉరుస్తోందని ఇంట్లో ఉండలేని పరిస్థితి ఏర్పడింది. మరుగుదొడ్లు కూడా లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ ఇంట్లో చూసినా అసంపూర్తి పనులేనని గోడలు కట్టి పైన బండలు పరిచి తరువాత ఇటు వైపు కన్నెత్తి కూడా చూడలేదని తాము ఇళ్లకు మరమ్మతులు చేసుకుందామన్నా రోజువారి కూలీ పనులు చేసుకుని ఏ పూటకి ఆ పూట గంజి తాగి జీవనం సాగిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ఒక్క సెంటు వ్యవసాయ భూమి కూడా లేదని ప్రభుత్వం పేదలకు ఎస్టీలకు ఉచితంగా వ్యవసాయ భూమి అందిస్తామన్న హామీలు ఏమయ్యాయో అర్థం కావడం లేదని అయోమయంతో తెలిపారు. గ్రామంలో వికలాంగురాలు సుభద్ర వుందని ఆమెకు పింఛను అందడం లేదని, రాజమ్మ అనే మూగ అమ్మాయికి పింఛను అందడం లేదని తెలిపారు. నాయకులు ఎన్నికల సమయంలో రావడం హామీలు ఇవ్వడం ఓట్లు వేయించుకోవడం తప్ప ఇన్ని సంవత్సరాలుగా ఒక్కరూ తమ గ్రామ అభివృద్ధి కోసం కృషి చేయలేదని 'ప్రజాశక్తి' చొరవతో తమ గ్రామాన్ని అభివృద్ధి చేస్తే తాము ఎంతో రుణపడి ఉంటామని పేర్కొన్నారు.

ఇటీవల కాలంలో ఏనుగుల సంచారం అధికం కావడం తమ గ్రామం సమీపం నుండి వెళుతూ ఉండడం వల్ల తాము ఎప్పుడు ఏ నిమిషంలో ఏ ముప్పు ఎదురవుతుందో తెలియక భయాందోళనతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బతుకుతున్నామన్నారు. గ్రామం మొత్తం గిరిజనులమే వున్నామని తెలిపారు.

తాగునీటిని సరఫరా చేసే బోరుబావి ప్రైవేటు వ్యక్తుల వ్యవసాయ పొలంలో వేయడం వల్ల ఆయన భూమిలో పంట పండిస్తే తాము బోరు బావి వద్దకు వెళ్లి తాగునీరు తెచ్చుకోవాలన్నా పొలంపై నడిచి వెళ్లొద్దని భూయజమాని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని నూతన బోరును తమ గ్రామంలో ఏర్పాటు చేసి ఇంటింటికీ తాగునీరు అందించి తమకు తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు.

గ్రామంలో అసంపూర్తి గోడలతోవున్న గృహాలు

తాగునీటికి ఇబ్బందులు

తాగునీటికి పలు ఇబ్బందులు పడుతున్నాం..గతంలో బోరు బావిలో పుష్కలంగా వచ్చేవి. అధికారులు పట్టించుకుని వెంటనే తాగునీటి సమస్యను పరిష్కరిం చాలి..

- ఆనందమ్మ, పాయలగుట్ట.

వీధి లైట్లు లేవు..

గ్రామంలో వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రి వేళల్లో వీధిలోకి రావాలంటే విష సర్పాలు, ఇతర విష కీటకాలతో ఇబ్బందులు పడుతున్నాం.. వీధి దీపాలు ఏర్పాటు చేయాలి..

- కుమారి, పాయలగుట్ట.

దారి సౌకర్యం కల్పించాలి

మా గ్రామానికి రావడా నికి దారి సౌకర్యం లేదు. సిమెంటు రోడ్డు, మురుగు నీటి కాలువలు లేవు. సమస్యలతో ఎన్నో ఏళ్లు కొట్టుమిట్టాడుతున్నాం.

- లక్ష్మీ ప్రసాద్ దంపతులు, పాయలగుట్ట.

నాయకులు స్పందించడం లేదు...

నాయకులు ఎన్నికల సమయంలో వచ్చి రెండు రోజుల్లో ఇసుక, కంకర సిమెంటు తెప్పించి సిమెంటు రోడ్డు వేస్తామని చెప్పి వెళ్లారు.. రోజులు గడుస్తున్నా పనులు మాత్రం ముందుకు సాగడం లేదు.

- ఈశ్వరమ్మ, పాయలగుట్ట.

SRI PADMAVATI MAHILA VISVAVIDYALAYAM, TIRUPATI (WOMEN'S UNIVERSITY)

Nit. No. 2/SPMVV/E.S/2024-25 Date. 24.07.2024

e - Procurment Tender Notice

Tenders are invited for 4 civil works and one electrical work in Sri Padmavati Mahila Visvavidyalayam, Tirupati.

Bid document down loading start date : 29-07-2024 at 3.00 P.M.
Bid document down loading end date : 12-08-2024 at 3.30 P.M.
Last date & time for receipt of bids : 12-08-2024 upto 4.00 P.M.
Price bid (Financial bid) opening date : 13-08-2024 at 11.00 A.M.

Further details can be seen at AP E-procurement plot from in and University Web site www.spmvv.ac.in.

REGISTRAR